సాక్షి
మహబూబాబాద్
బుధవారం ¦ 24 ¦ జనవరి ¦ 2024



భక్తులకు ఇబ్బందులు తలెత్తొద్దు

మేడారం భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని గిరిజన సంక్షేశాఖ సెక్రటరీ డాక్టర్ శరత్ అన్నారు.

- 10లో▸



కిక్ బాక్సింగ్‌లో పతకాల పంట

హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు.

- 10లో▸

గరిష్టం/కనిష్టం
32.9^0 / 20.1^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి. కాస్త మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఆదివాసీలకు అవకాశాలు కల్పించాలి



నెహ్రూసెంటర్: ఆదివాసీలకు రాజకీయ అవకాశాలు కల్పించాలని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని పార్టీలు టికెట్లు కేటాయించాలని ఆదివాసీ ఐక్య కార్యాచరణ సమితి జాతీయ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్యదొర అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివాసీ సంఘాల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీలు అత్యధికంగా ఉన్నప్పటికీ ఒకే సామాజిక వర్గానికి పార్లమెంట్ టికెట్ ఇస్తున్నారని అన్నారు. ఆదివాసీలకు అధిక స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో రమనల లక్ష్మయ్య, పొదెం రత్నం, గుండు శరత్, వట్టం ఉపేందర్, వట్టం నారాయణ, కృష్ణప్రసాద్, పాపారావు, నర్సింహారావు, కుంజ దుర్గ, బాలరాజు, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ డేవిడ్

మహబూబాబాద్: జాతీయ ఓటరు దినోత్సవాన్ని జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ డేవిడ్ బీఎల్‌ఓలను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో జిల్లా, ఎన్నికల విభాగం అధికారులతో జాతీయ ఓటరు దినోత్సవంపై అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 25 జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఎల్‌ఓలు కేంద్రాల వద్ద తగు ఏర్పాట్లు చేయాలన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యతపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి



బయ్యారం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ రామారావు సూచించారు. మండలంలోని వెంకట్రాంపురం ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా పలు రికార్డులను పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పదోతరగతిలో అన్ని సబ్జెక్టుల సిలబస్ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లింగరాజు, ఉపాధ్యాయులు రమేష్, వీరన్న, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేయాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈనెల 25న జాతీయ ఓటరు దినోత్సవ సందర్భంగా ఉదయం ప్రార్థన సమయంలో ఓటరు ప్రతిజ్ఞ చేసి, ఓటరు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని డీఈఓ రామారావు మంగళవారం తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు.


25న జాబ్‌మేళా

మహబూబాబాద్: జిల్లా ఉపాధి అధికారి కార్యాలయంలో ఈనెల 25న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో సేల్స్ మేనేజర్, ఏజెన్సీ సేల్స్‌మేనేజర్, ఇన్సూరెన్స్ అడ్వైజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. జిల్లాలో అర్హత గల నిరుద్యోగులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్సెస్సీ నుంచి డిగ్రీ వరకు చదివి ఉండి 25నుంచి 45 సంవత్సరాల వయస్సు వారి అర్హతను బట్టి ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. 25న ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. విద్యార్హత సర్టిఫికెట్స్, బయోడేటాతో హాజరు కావాలని కోరారు. వివరాల కోసం 94405 51642 నంబర్‌లో సంప్రదించాలన్నారు

జిల్లాస్థాయి గణిత పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మహబూబాబాద్ రూరల్: జిల్లా స్థాయి గణిత పోటీల్లో మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి జెడ్పీ హై స్కూల్ విద్యార్థులు పి.కౌశల్, ఏ.సజని ప్రతిభ చూపారని హెచ్‌ఎం రమేష్ బాబు మంగళవారం తెలిపారు. తొర్రూరు పట్టణంలో ఈ నెల 21న జిల్లా స్థాయి గణిత పోటీలు జరిగాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, గైడ్ టీచర్ సతీష్ కుమార్, గణిత ఉపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి, కాసం శ్రీనివాసరావును ఉపాధ్యాయ బృందం అభినందించింది.

డిప్యుటేషన్ రద్దు చేస్తారా?



ఆరోగ్యశాఖలో డిప్యుటేషన్లపై చర్చ

- పని ప్రదేశం నుంచి 60మంది స్థానచలనం
- 15మంది ఇతర జిల్లాల్లో విధులు
- 45 మంది జిల్లా పరిధిలోనే డ్యూటీ
- ఉన్నతాధికారుల ఆదేశాలతో వివరాల సేకరణ

సాక్షి, మహబూబాబాద్: జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు పైరవీలతో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి డిప్యుటేషన్‌పై వెళ్లి విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే అలాంటి వారిపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిసారించింది. డిప్యుటేషన్లు రద్దు చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఈమేరకు జిల్లా వైద్యారోగ్యశాఖలోని కొందరు ఉద్యోగులు డిప్యుటేషన్లు వేయించుకొని సొంత పనులు ఎక్కువ చేసుకుంటున్నారు. కాగా రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కమిషనర్ పూర్తి వివరాలు సేకరించే పనిలో ఉండగా.. డిప్యుటేషన్ రద్దు చేస్తే మళ్లీ ఎక్కడికి వెళ్లాల్సి వస్తుందనే ఆందోళన ఉద్యోగుల్లో మొదలైంది.

స్థానచలనం..

తమకున్న రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుని కొందరు.. అధికారుల పరిచయాలతో మరికొందరు జిల్లాలోని తాము పనిచేస్తున్న ప్రాంతాల నుంచి ఇతర ప్రాంతాలకు స్థానచలనమయ్యారు. ఇలా జిల్లా నుంచి 15మంది వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, ఖమ్మం, హనుమకొండ, వికారాబాద్, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లారు. అదేవిధంగా మరో 45మంది జిల్లాలోని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బదిలీ అయిన వారు ఉండడం గమనార్హం. అలాగే ఇతర జిల్లాల్లో పనిచేయాల్సిన ఉద్యోగులు పది మంది మేరకు డిప్యుటేషన్, మ్యూచువల్ పద్ధతుల్లో తిరిగి ఇక్కడికే వచ్చినట్లు సమాచారం.

ఆందోళన మొదలు..

ఉద్యోగంతో పాటు ప్రైవేట్ వ్యాపారాలకు ప్రాధాన్యత ఇస్తున్నవారి సంఖ్య పెరగడంతో ప్రస్తుతం డిప్యుటేషన్ రద్దుపై జరుగుతున్న చర్చతో పలువురిలో ఆందోళన మొదలైంది. జిల్లా కేంద్రంతో పాటు, గంధంపల్లి, కొత్తగూడ, గూడూరు మొదలైన మారుమూల ప్రాంతాల్లో ఉద్యోగాలు చేయాల్సి ఉంది. అయితే తమకున్న ప్రైవేట్ నర్సింగ్ హోమ్స్, రియల్‌ఎస్టేట్, ఇతర వ్యాపారాలు చేసుకునేందుకు వీలుగా హైదరాబాద్, వరంగల్, హనుమకొండ వంటి ప్రాంతాలకు డిప్యుటేషన్లు వేయించుకున్నారు. ఇందుకోసం అప్పుడు పలువురు రాజకీయ నాయకులకు లక్షల రూపాయలు ముట్టచెప్పినట్లు సమాచారం. దీంతో వారు డిప్యుటేషన్‌పై వెళ్లిన చోట కూడా సక్రమంగా పనిచేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. అదేవిధంగా జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో పనిచేయాల్సిన డాక్టర్లు, ఉద్యోగుల్లో కొందరు అక్కడి నుంచి జిల్లాలోని పట్టణాలు, బస్సు, రైలు సౌకర్యం ఉన్న ప్రాంతాలకు డిప్యుటేషన్‌పై వచ్చి పనిచేస్తున్నారు. కాగా ప్రస్తుతం డిప్యుటేషన్ రద్దు అయితే తమ పరిస్థితి ఏమిటి.. చక్కగా నడిచే ప్రైవేట్ ఆస్పత్రులు, లక్షల రూపాయల ఆదాయం ఉన్న ఇతర వ్యాపారాలను విడిచిపెట్టి వెళ్లాలా అనే ఆందోళన వారిలో మొదలైంది. అదేవిధంగా కొందరు ఉద్యోగులు ఇప్పటికే తమ డిప్యుటేషన్ రద్దు చేయవద్దని గాడ్ ఫాదర్స్ ద్వారా ప్రస్తుత ప్రభుత్వంలోని ముఖ్య నాయకులు, మంత్రుల వద్దకు వెళ్లి పైరవీలు చేయించుకోవడం మొదలు పెట్టారని ప్రచారం.

జిల్లాకు వచ్చిన వారిలో..

జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు డిప్యుటేషన్‌పై వెళ్లిన వారికే కాకుండా ఇతర జిల్లాల నుంచి జిల్లాకు వచ్చిన వారిలో కూడా ఆందోళన మొదలైంది. జిల్లాలో పనిచేస్తున్న వారు 317 జీఓ ద్వారా దూర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. ఈక్రమంలో వారికి ఉన్న పరిచయాలు, రాజకీయ పలుకుబడితో మళ్లీ ఇక్కడికి మ్యూచువల్, డిప్యుటేషన్లపై తిరిగి వచ్చారు. వీరిలో కొందరు డిపార్టుమెంట్‌లో ప్రధాన అధికారుల వద్ద తాము చెప్పిందే వేదం అన్నట్లు వ్యవహరిస్తున్నట్లు ప్రచారం. కాగా డిప్యుటేషన్లు, మ్యూచువల్ పద్ధతులు రద్దు చేస్తే ఏం చేయాలని ఆలోచనలో ఉన్నారు.

అన్నదాతల అవసరాలు తీరుస్తాం

● ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

మహబూబాబాద్ రూరల్: అన్నదాతల అవసరాలు తీరుస్తామని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో మిర్చికొనుగోళ్లను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహబూబాబాద్ మార్కెట్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ స్థలం సరిపోవడం లేదని, 20ఎకరాల స్థలాన్ని కేటాయించి విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లానని, ప్రభుత్వంతో చర్చించి మార్కెట్ అభివృద్ధికి, విస్తరణకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. రైతుల కోసం 5రూపాయల భోజన పథకాన్ని మార్కెట్‌లో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. వ్యాపారులు రైతుల కష్టాన్ని గుర్తించి గిట్టుబాటు ధర పెట్టాలన్నారు. కాంటాలు త్వరగా పూర్తి చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. వ్యాపారులు, రైతులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, సెక్రటరీ షంషీర్, డైరెక్టర్లు భూక్య సరియా, బొంత వెంకన్న, సామ బిక్షంరెడ్డి, గార్లపాటి భరద్వాజ్ రెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ అరుణ, సూపర్‌వైజర్ రమేష్, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్, టీపీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక సన్నాహక సమావేశంలో వారు పాల్గొని పట్టభద్రులు, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఓటరు నమోదు ప్రక్రియను కాంగ్రెస్ పార్టీశ్రేణులు వేగవంతం చేయాలన్నారు. ఫిబ్రవరి 6లోగా డిగ్రీ అర్హత సాధించిన ప్రతీ ఒక్కరితో ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. తెలంగాణ ప్రజలు విద్యుత్ బిల్లులు చెల్లించకుండా కాంగ్రెస్ అధినేత సోనియాగాంధీ ఇంటికి పంపాలని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు బిల్లులను కేసీఆర్ ఇంటికి పంపాలా అని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీ పథకాలను ప్రభుత్వం తప్పకుండా అమలు చేస్తుందన్నారు. టీపీసీసీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బెల్లయ్యానాయక్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ఉమా, నాయకులు అంజయ్య, సురేష్, రామరాజు ఉన్నారు.

భద్రకాళిని దర్శించుకున్న స్థపతి వల్లీనాయగం

హన్మకొండ కల్చరల్ : వరంగల్ భద్రకాళి దేవాలయాన్ని మంగళవారం దేవాదాయధర్మాదాయ శాఖ స్థపతి వల్లీనాయగం సందర్శించారు. ఆయనను ముందుగా ఈఓ శేషుభారతి, అర్చకులు భద్రకాళి శేషు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకపూజలు జరిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఈఈ దుర్గాప్రసాద్, వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీకాంతారావు, డీఈఈ రమేష్‌బాబు, ఏఈఈ చందర్‌రావు, సూపరింటెండెంట్ వీరస్వామి ఉన్నారు.

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



ప్రజాప్రతినిధులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు: తొర్రూరు మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా వార్డుల్లోని సమస్యలను కౌన్సిలర్లు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి కట్టుబడి ఉందని, ప్రత్యేక నిధులు కేటాయించి సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. పట్టణంలో భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తామని, పరిశుభ్ర మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తామన్నారు. కుక్కలు, కోతుల బెడద నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణ పనులు చేపడుతామన్నారు. గత ప్రభుత్వ హయాంలో అనర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించినట్లు తమ దృష్టికి వచ్చిందని, దానిపై తగు నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి నుంచి 200యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలు కానుందని తెలిపారు. అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో మాట్లాడుతూ.. పట్టణ భవిష్యత్ అవసరాల దృష్ట్యా అంతర్గత రోడ్ల విస్తరణకు ముందస్తు ప్రణాళికలు చేపట్టాలని సూచించారు. ఎజెండాలోని అంశాలు ఆమోదం పొందినట్లు కమిషనర్ పుష్పాల సరస్వతి తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి, విద్యుత్‌శాఖ డీఈ మధుసూదన్, మున్సిపల్ ఏఈ రంజిత్, మేనేజర్ కట్టా స్వామి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

● కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్: వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో తాగునీటి పథకం.. వేసవి ప్రణాళికపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మిషన్ భగీరథ అధికారులు తాగునీటి సరఫరాపై పూర్తి సమాచారం ఎప్పటికప్పుడు అందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లో తాగునీటి సమస్య రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో తాగునీటి సమస్య రాకుండా ఈదులపూసపల్లి రహదారిలోని చెరువును ముందస్తుగా నింపాలన్నారు. తాగునీటి పథకాల అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, డేవిడ్, జెడ్పీ సీఈఓ రమాదేవి, డీఆర్‌డీఓ సన్యాసయ్య, మిషన్ భగీరథ అధికారులు సురేందర్, కృష్ణారెడ్డి, డీపీఓ హరిప్రసాద్, కమిషనర్లు ప్రసన్నరాణి, రాజు, మున్వర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వరం..

మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- ఆరో తరగతిలో చేరేందుకు అవకాశం
- ఫిబ్రవరి 22న చివరి గడువు
- ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష



మరిపెడలోని మోడల్ స్కూల్

మరిపెడ రూరల్: గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు మోడల్ స్కూళ్లు ఓ వరం. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేస్తున్న మోడల్ స్కూళ్లలో చేరేందుకు విద్యార్థులు ఇష్టపడుతున్నారు. కాగా మోడల్ స్కూళ్లలో 2024–25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఇటీవల నోటిఫికేషన్ వెలువడింది. ఈ నెల 12నుంచి దఖాస్తులు స్వీకరిస్తుండగా.. ఫిబ్రవరి 22వ తేదీ చివరి గడువు. ఏప్రిల్ 7న ఉదయం 10నుంచి 12గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. అదేవిధంగా 7,8,9,10 తరగతుల్లో మిగిలిన సీట్లు భర్తీకి ప్రవేశ పరీక్ష అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు జరుగనుంది. పరీక్ష ఫీజు ఎస్సీ,ఎస్టీ,బీసీ, దివ్యాంగ విద్యార్థులు రూ.125,జనరల్ విద్యార్థులు రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

ఒక్కో పాఠశాలలో 100 సీట్లు..

మానుకోట జిల్లాలో 8 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. డోర్నకల్ మండలం చిలుకోడు, మరిపెడ, కురవి మండలం నేరడ, మహబూబాబాద్ మండలం అనంతారం, తొర్రూరు మండలం గుర్తూరు, కేసముద్రం మండలం కల్వల, నెల్లికుదురు, నర్సింహులపేటలో మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి 100 సీట్లు ఉంటాయి. 7,8,9,10 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను మాత్రమే భర్తీ చేయనున్నారు.

ఏప్రిల్ 1నుంచి హాల్ టికెట్ల డౌన్‌లోడ్.

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఏప్రిల్ 1నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష ఉంటుంది. మే 15న ఫలితాలు వెల్లడించి, సంబంధిత ప్రిన్సిపాళ్లకు మెరిట్ జాబితాను అందజేస్తారు. మే 24న ఎంపికైన విద్యార్థుల జాబితా ఖరారు చేసి అడిషనల్ కలెక్టర్ ఆమోదం పొందుతారు. మే 25 నుంచి 31 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తారు. 2024 జూన్ 1న తరగతులు ప్రారంభమవుతాయి.

పరీక్ష విధానం..

ప్రవేశ పరీక్షలో వంద మార్కులకు వంద ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నపత్రం తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఉంటుంది. ఆరో తరగతిలో తెలుగు, గణితం, ఎన్విరాన్‌మెంట్ సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో ఒక్కోదాని నుంచి 25 ప్రశ్నలు వస్తాయి. 7 నుంచి 10వ తరగతులకు గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రాలు, ఇంగ్లిష్‌లో ఒక్కోదాని నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. రెండు గంటల పాటు ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తారు.

బాలికలకు హాస్టల్ సౌకర్యం..

ఆదర్శ పాఠశాలల్లో బాలికలకు మాత్రమే హాస్టల్ వసతి ఉంది. 9,10 తరగతులతో పాటు ఇంటర్ చదువుతున్న వంద మందికి మాత్రమే హాస్టల్ వసతి అవకాశం ఉంది. హాస్టల్‌కు కనీసం 3 కిలోమీటర్లు, ఆపై దూరంగా ఉండేవారు హాస్టల్‌లో ప్రవేశానికి అర్హులు.

చక్కటి అవకాశం..



ఆదర్శ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్నం పూట భోజనం అందిస్తున్నాం. క్రమశిక్షణ, మెరుగైన ఫలితాలతో ముందంజలో ఉన్న ఆదర్శ పాఠశాలల్లో చేర్పించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ఈ చక్కటి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– పి.రామారావు, డీఈఓ

ధాన్యం డబ్బులు పక్కదారి..

- రైతులు ప్రశ్నించడంతో చివరికి చేతికి అందజేత
- మండలంలోని నామాలపాడు ఐకేపీ కేంద్రంలో ఘటన

బయ్యారం: మండలంలోని నామాలపాడులో ఇల్లెందు–మహబూబాబాద్ ప్రధాన రహదారి పక్కన ఎర్రకాల్వ సమీపంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొత్తపేటకు చెందిన రైతులు పప్పుల వెంకటయ్య, గుగులోత్ శంకర్, ఖండపనేని ప్రసాద్, ముత్తయ్య సుమారు రూ.11లక్షల విలువైన సన్నధాన్యం విక్రయించారు. ఆ సమయంలో నిర్వాహకులు రైతుల నుంచి పట్టాదారు పాస్‌పుస్తకాలతో పాటు ఆధార్, బ్యాంకు ఖాతాల జిరాక్స్ ప్రతులను తీసుకున్నారు.

కాగా ధాన్యం మిల్లుకు చేరగానే మిల్లరు ఇచ్చే ట్రక్‌షీట్ ఆధారంగా సంబంధిత రైతుల ఆధార్‌ను సరిచూసుకొని ఓటీపీ ద్వారా పౌరసరఫరాలశాఖకు డబ్బుల నిమిత్తం సెంటర్ నిర్వాహకులు ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుంది. అయితే రైతులకు అనుమానం రాకుండా కొనుగోలు కేంద్రంలో ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసే వ్యక్తి ఓటీపీని తీసుకున్నప్పటికీ రైతుల ఖాతాల వివరాలు నమోదు చేయకుండా.. తనకు సంబంధించిన వారి వివరాలు పొందుపర్చాడు. దీంతో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో పడాల్సిన నగదు కొనుగోలు కేంద్రం నిర్వాహకుల బంధువుల ఖాతాల్లో పడింది.

డబ్బులు ఆలస్యం కావడంతో వెలుగులోకి..

ధాన్యం మిల్లుకు తరలించి రోజులు గుడుస్తున్నా డబ్బులు తమ ఖాతాల్లో పడకపోవడంతో అనుమానం వచ్చిన రైతులు కేంద్రం నిర్వాహకులను నిలదీశారు. దీంతో సమాచారం తెలుసుకున్న ఐకేపీ అధికారులు, కేంద్రం నిర్వాహకులతో మాట్లాడి రైతులకు డబ్బులు ఇప్పించినట్లు తెలిసింది. చివరకు డబ్బులు అందడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. నిర్వాహకులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు అధికారులను కోరుతున్నారు.

గీత కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



కేజీకేఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కేసముద్రం: అసెంబ్లీ ఎన్నికల ముందు గీత కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణగౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని లక్ష్మీసాయిగార్డెన్స్‌లో కేజీకేఎస్ ఆధ్వర్యంలో గౌడల ఆత్మీయ సమ్మేళనం, నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రమాదానికి గురై మృతిచెందిన కల్లు గీత కార్మికులు, శాశ్వత దివ్యాంగులకు రూ.10లక్షలు, తాత్కాలిక దివ్యాంగులకు రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా నెలరోజుల వ్యవధిలో చెల్లించాలన్నారు. మానుకోట మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఉమా మాట్లాడుతూ.. కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గండు సావిత్రమ్మ, గోపా డివిజన్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్, సంఘం జిల్లా అధ్యక్షుడు యమగాని వెంకన్న, మండల అధ్యక్ష,కార్యదర్శులు ఉప్పలయ్య, వెంకటేశ్వర్లు, కేసముద్రం సొసైటీ చైర్మన్ దికొండ వెంకన్న, గంధసిరి స్వరూప, సోమన్న, కదిర స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



జీఓ ప్రతులను దహనం చేస్తున్న సీపీఐ శ్రేణులు

నెహ్రూసెంటర్: మానుకోట మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్ నిధులు కేటాయించకుండా ఇచ్చిన జీఓ ప్రతులను మంగళవారం దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మున్సిపాలిటీకి రూ.50 కోట్ల నిధులు మంజూరు చేస్తామని చెప్పి, మాట తప్పిందన్నారు. దీంతో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయన్నారు. నిధులు ఇవ్వకపోవడంతో చెక్‌బౌన్స్ మాదిరిగా జీఓలు మిగిలిపోయాయని మండిపడ్డారు. నిధులు లేని జీఓ కాపీలను ప్రదర్శిస్తూ జిల్లా కేంద్రంలోని ధర్మన్న సెంటర్, సర్వేపల్లి సెంటర్, అంబేడ్కర్ సెంటర్‌లో దహనం చేసినట్లు చెప్పారు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపాలిటీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాల కోరారు. పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, కట్లోజు పాండురంగా చారి,చింతకుంట్ల వెంకన్న,మామిండ్ల సాంబలక్ష్మి, వీరవెల్లి రవి, నర్ర శ్రావణ్, మేక వీరన్న, చిదిరాల జ్ఞానేశ్వర్ ఉన్నారు.

నేడు కాజీపేట రైల్వే ఆస్పత్రి ప్రారంభం

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో నూతనంగా నిర్మించిన రైల్వే ఆస్పత్రిని బుధవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ప్రారంభించనున్నట్లు మంగళవారం స్థానిక అధికారులు తెలిపారు. రైల్వే కార్మిక కుటుంబాల వైద్య సదుపాయం కోసం దక్షిణ మధ్య రైల్వే సుమారు రూ.2 కోట్ల వ్యయంతో కరోనా సమయంలో ఆస్పత్రిని నిర్మించతలపెట్టారు. 7 ప్రత్యేక గదులతో మోడల్ ఆస్పత్రిని నిర్మించారు. చుట్టుపక్కల గ్రీనరీని ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. రైల్వే జీఎం పర్యటనలో రైల్వే ఆస్పత్రిని ప్రారంభించిన అనంతరం పలు విభాగాలను తనిఖీ చేయనున్నారు. వేరే రైల్వే విభాగాలకు వెళ్లి అక్కడ తనిఖీలు చేపట్టి పలు ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. జీఎం పర్యటనలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా కాజీపేట, సికింద్రాబాద్ రైల్వే అధికారులు అప్రమత్తమై తగు జాగ్రత్తలు పడుతున్నారు.

రైల్వే జీఎం టూర్ షెడ్యూల్

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి బుధవారం ఉదయం 9 గంటలకు రైల్వే జీఎం ఏకే జైన్ ప్రత్యేక రైలులో బయలుదేరి సెక్షన్‌లో తనిఖీ చేసుకుంటూ 11 గంటలకు కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటారు. జంక్షన్‌లో రైల్వే పాలిక్లినిక్, కోచింగ్ డిపోలను తనిఖీ చేస్తారని అధికారులు వెల్లడించారు.

చికిత్స పొందుతున్న జీపీ కార్మికుడి మృతి


మహేందర్‌(ఫైల్‌)

దుగ్గొండి: భార్యను చితక బాదిన అనంతరం అత్తింటి వారు మందలిస్తారని భయపడిన ఓ పారిశుద్ధ్య కార్మికుడు.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గిర్నిబావిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సింగారపు మహేందర్‌(35) కొన్ని సంవత్సరాలుగా గ్రామ పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మహేందర్‌ భార్య రమ ఈనెల 18న మొక్కులు సమర్పించడానికి వేములవాడకు వెళ్లింది. తిరిగి 19న రాత్రి ఇంటికి రావడంతో మహేందర్‌ ఆమెతో గొడవ పడ్డాడు. రమను చితకబాదడంతో ఆమె చేయి విరిగింది. దీంతో విషయం తన అత్తింటి వారికి తెలిసి వారు వచ్చి తనను మందలిస్తారని భయపడి అదే రోజు అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి జనార్దన్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జక్కుల పరమేష్‌ తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తొద్దు

- ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలి
- గిరిజన సంక్షేమశాఖ సెక్రటరీ శరత్‌


జంపన్నవాగు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సెక్రటరీ శరత్‌, డైరెక్టర్‌ వెంకటనర్సింహారెడ్డి

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని గిరిజన సంక్షేశాఖ సెక్రటరీ డాక్టర్‌ శరత్‌ అన్నారు. మంగళవారం మేడారంలోని సమ్మక్క (ఆదివాసీ) భవనంలో సంక్షేమ శాఖ డైరెక్టర్‌ వెంకటనర్సింహారెడ్డి, కలెక్టర్‌ ఇలా త్రిపాఠితో కలిసి జాతర ఏర్పాట్లపై ఆయశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడారానికి భక్తులు అధికంగా తరలివస్తున్నారని, ప్రస్తుతం పూర్తయిన పనులను వారికి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే, పార్కింగ్‌ స్థలాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సైన్‌ బోర్డులు, ఫ్లడ్‌ లైట్లు, టాయిలెట్‌ తదితర అన్ని వసతులు చేపట్టాలన్నారు. భక్తుల సౌకర్యాల కల్పనలో రాజీ పడొద్దని, ప్రతి అంశంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. సివిల్‌ పనులు మరో ఏడు రోజుల్లో పూర్తి కానున్నట్లు తెలిపారు. జంపన్నవాగులో లోతు ప్రాంతాలు గుర్తించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుక లెవలింగ్‌ సక్రమంగా చేపట్టాలన్నారు. నిరంతర విద్యుత్‌ సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. డైరెక్టర్‌ వెంకటనర్సింహారెడ్డి మాట్లాడుతూ అధికారులు విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. బారికేడింగ్‌ ఏర్పాటులో పోలీస్‌ శాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు. అధికారులు టీమ్‌ వర్క్‌తో పనిచేసి జాతరను జయప్రదం చేయాలన్నారు. అనంతరం జాతరలో చేపడుతున్న ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అంతకుముందు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సమావేశంలో ఎస్పీ శబరిష్‌, పీఓ అంకిత్‌, అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణు గోపాల్‌, డీఎఫ్‌ఓ రాహుల్‌ కిషన్‌ జాదవ్‌, ఓఎస్డీ అశోక్‌ కుమార్‌, ఐటీడీఏ ఏపీఓ వసంతరావు, ఆలయ ఈఓ రాజేంద్రం, తదితరులు అధికారులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ.9 లక్షల విలువైన ఆస్తి అగ్నికి ఆహుతి
- వెంక్యాతండాలో ఘటన


దగ్ధమైన గృహోపకరణాలు, నగదు, వెండి ఆభరణాలు

కేసముద్రం: షార్ట్‌సర్క్యూట్‌తో ఓ ఇంట్లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో రూ.9 లక్షల విలువైన బంగారం, వెండి, నగదుతోపాటు, గృహోపకరణాలు, బియ్యం దగ్ధమయ్యాయి. ఈ ఘటన మండలంలోని ధర్మారంతండా జీపీ శివారు వెంక్యాతండాలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా సోమవారం సాయంత్రం తండాలో అన్నదానం ఏర్పాటు చేయగా, ఇదే తండాకు చెందిన కున్సోత్‌ బాబు తన ఇంటికి తాళం వేసి కుటుంబీకులతో కలిసి అక్కడికి వెళ్లాడు. ఈ క్రమంలో రాత్రి 7 గంటల సమయంలో ఇంట్లో షార్ట్‌ సర్క్యూట్‌ ఏర్పడి నిప్పురవ్వలు వస్తువులపై పడి మంటలు వ్యాపించాయి. ఇంటి నుంచి పొగలు వస్తుండడంతో తండావాసులు అక్కడికి చేరుకున్న మంటలు ఆర్పేప్రయత్నం చేశారు. కాని అప్పటికే రూ.2 లక్షల నగదు , 2 తులాల బంగారం, 40 తులాల వెండి, కంప్యూటర్‌, జిరాక్స్‌ ప్రింటర్‌, 10వ తరగతి మెమో, ఇతర సర్టిఫికెట్లు, 3 క్వింటాళ్ల బియ్యం, దుస్తువులు, గృహోపకరణ వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. మొత్తం సుమారు రూ.9 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ఈ మేరకు ఆర్‌ఐ బాబు, కార్యదర్శి ముఖేష్‌ మంగళవారం ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

గంజాయితో వెళ్తున్న కారు బోల్తా


బోల్తాపడిన కారు ఇదే..

నెల్లికుదురు : గంజాయితో వెళ్తున్న కారును ఎక్సైజ్‌ పోలీసులు వెంబడిస్తుండగా పారిపోయే క్రమంలో బోల్తా పడింది. ఈ ఘటన మంగళవారం మండలంలోని బంజర బస్‌ స్టేజీ సమీపంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు కారులో గంజాయితో మహబూబాబాద్‌ నుంచి నెల్లికుదురు వైపునకు వస్తున్నారు. దీనిపై సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్‌ పోలీసులు సదరు వాహనాన్ని వెంబడిస్తున్నారు. విషయం తెలిసిన గంజాయి వాహనదారులు పారిపోయే క్రమంలో వేగంగా వస్తూ మండలంలోని బంజర బస్‌ స్టేజీ సమీపం వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో లక్ష్మీపురం గ్రామానికి వెళ్లే దారి వైపు అదే వేగంతో మళ్లించడంతో కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. కారు ఎక్సైజ్‌ పోలీసులు స్వాధీనం చేసుకుని తొర్రూరు వైపునకు తీసుకెళ్లారు. ఈ విషయమై పోలీసులను సమాచారం అడగగా ధ్రువీకరించలేదు.

కల్తీ పెట్రోల్‌ విక్రయిస్తున్నారని ఆందోళన


కల్తీ పెట్రోల్‌ను ఫొటో తీస్తున్న బాధితుడు

కాజీపేట: కాజీపేట డీజిల్‌ కాలనీలోని ఓ బంక్‌లో కల్తీ పెట్రోల్‌ విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ ద్విచక్ర వాహనదారులు మంగళవారం రాత్రి ఆందోళన నిర్వహించారు. బాపూజీనగర్‌కు చెందిన ధార నాగరాజు ఓ బాటిల్‌లో హాఫ్‌ లీటర్‌ పెట్రోల్‌ పోయించుకోగా నీళ్లను పోలినట్లు వచ్చింది. దీంతో అనుమానం వచ్చి వెంటనే మరో బాటిల్‌లో పెట్రోల్‌ పోయించగా రంగు మరో తీరు కనిపించింది. దీంతో పెట్రోల్‌ కల్తీ జరిగిందని ఆరోపిస్తూ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఈ ఘటనపై బీజేపీ నాయకులు మహేందర్‌, వెంకట్రావు కాజీపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

కేయూలో క్రాస్‌కంట్రీ పోటీలు

- చాంపియన్‌షిప్‌ సాధించిన కేడీసీ విద్యార్థులు..


చాంపియన్‌షిప్‌ సాధించిన జట్టుకు కప్‌ అందజేస్తున్న వీసీ రమేష్‌

కేయూ క్యాంపస్‌ : కాకతీయ యూనివర్సిటీలోని స్పోర్ట్స్‌బోర్డు ఆధ్వర్యంలో 2023–2024 విద్యాసంవత్సరానికి సంబంధించి మంగళవారం ఇంటర్‌ కాలేజియేట్‌ క్రాస్‌కంట్రీ చాంపియన్‌ షిప్‌ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పురుషుల విభాగంలో హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచి చాంపియన్‌ షిప్‌ సాధించారు. ఖమ్మం యూనివర్సిటీ వ్యాయామ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. మహిళా విభాగంలో కాకతీయ యూనివర్సిటీ మహిళా వ్యాయామ కళాశాల విజేతగా నిలిచి చాంపియన్‌ షిప్‌ సాధించింది. ఉట్నూరు కళాశాల(టీటీడబ్ల్యూ ఆర్‌డీసీ మహిళా) ద్వితీయ స్థానంలో నిలిచింది. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. అంతకుముందు వీసీ తాటికొండ రమేష్‌ ఈ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ శ్రీనివాస్‌రావు, పి భాస్కర్‌, ఏటీబీటీ ప్రసాద్‌, సావిత్రి, జేత్యా, జె ఉపేందర్‌, బి రమేష్‌, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కేయూకు రూ. వెయ్యి కోట్లు కేటాయించాలి

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్‌ మూర్తి


మాట్లాడుతున్న మూర్తి

కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధికి రూ. వెయ్యి కోట్లు కేటాయించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్‌ మూర్తి డిమాండ్‌ చేశారు. మంగళవారం కేయూలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పది సంవత్సరాల నుంచి ఉన్నత విద్యను అభివృద్ధి చేయడంలో విఫలమైందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్యారంగం పరిస్థితి దీనస్థితికి దిగజారిందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నత విద్యను, యూనివర్సిటీలను గాలికి వదిలేశాయని విమర్శించారు. జాతీయ నూతన విద్యావిధానంలో అనేక లోపాలున్నాయన్నారు. అందుకే ఈ విద్యావిధానాన్ని రద్దుచేయాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్‌, యూనివర్సిటీ సహాయ కార్యదర్శి స్టాలిన్‌, బాధ్యులు జస్వంత్‌, ప్రదీప్‌, కార్తీక్‌, అఖిల్‌ కుమార్‌, ప్రణయ్‌,సాయి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ అపహరించిన వ్యక్తి అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న డీఎస్పీ

డోర్నకల్‌: స్థానిక బైపాస్‌లోని పెట్రోల్‌ బంక్‌ వద్ద నిలిపిన ట్రాక్టర్‌ను అపహరించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం డోర్నకల్‌ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహబూబాబాద్‌ డీఎస్పీ సత్యనారాయణ చోరీకి సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ నెల 4వ తేదీన ఇండియన్‌ పెట్రోల్‌ బంక్‌ ఆవరణలో నిలిపిన ట్రాక్టర్‌ అపహరణకు గురికాగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఎస్సై సంతోష్‌రావు మంగళవారం సిబ్బందితో కలిసి గొల్లచర్ల సమీపంలో వాహన తనిఖీ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని గుర్రాలకుంట జీపీలోని ధాన్యా తండాకు చెందిన నూనావత్‌ శివ అనుమానాస్పద స్థితిలో కనిపించాడు. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా ట్రాక్టర్‌ అపహరించినట్లు ఒప్పుకున్నాడు. ట్రాక్టర్‌ను అపహరించిన శివ.. దానిని ఓ కార్వీలో పార్క్‌ చేశాడు. సోమవారం విక్రయించేందుకు తీసుకువెళ్తుండగా పట్టుకుని ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై సంతోష్‌రావు, కానిస్టేబుళ్లు సైదులు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ అవినీతిపై విచారణ జరిపించాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల బీజేపీ ఇన్‌చార్జ్‌ రాంచంద్రారావు


మాట్లాడుతున్న రాంచంద్రారావు

గీసుకొండ: బీఆర్‌ఎస్‌ సర్కారు అవినీతిపై సీబీఐ విచారణ చేయాలని, మోస పూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మరని బీజేపీ వరంగల్‌, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్‌, మాజీ ఎమ్మెల్సీ ఎన్‌. రాంచంద్రారావు అన్నారు. మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్‌ అధ్యక్షతన గ్రేటర్‌ వరంగల్‌ 16వ డివిజన్‌ ధర్మారంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో ఉమ్మడి వరంగల్‌ జిల్లా ముఖ్య నాయకులతో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యాధికులు బీజేపీ వైపే ఉన్నారన్నాని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎక్కువ మంది ఓటర్లను నమోదు చేయించి గెలుపొందేలా శ్రేణులు కృషి చేయాలన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి శ్రీరామ మందిర దర్శన్‌ అభియాన్‌ పేరుతో బీజేపీ ప్రభుత్వం అయోధ్య రామమందిరాన్ని దర్శించడాని ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసిందన్నారు. 40 సంవత్సరాల లోపు ఉన్న ఒక్కొక్కరికి రూ. 1665 టికెట్‌ ఉంటుందని తెలిపారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, మాజీ మేయర్‌ టి. రాజేశ్వర్‌రావు, మాజీ మంత్రి గుండె విజయరామారావు, మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, మొలుగూరి భిక్షపతి, ఎం. ధర్మారావు, వరంగల్‌ పార్లమెంట్‌ ప్రభారి మురళీధర్‌గౌడ్‌, ఉమ్మడి వరంగల్‌ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, దశమంతరెడ్డి, ఒద్దిరాజు రాంచంద్రారావు, బలరాం, కన్న యుగేంధర్‌, నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, డాక్టర్‌ కాళీప్రసాద్‌, డాక్టర్‌ విజయ్‌చందర్‌రెడ్డి, గట్టికొప్పుల రాంబాబు, క్రాంతికుమార్‌, గోదాసి అశ్విని తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, బైక్‌ ఢీ

- యువకుడికి తీవ్ర గాయాలు
- పరిస్థితి విషమం
- నాగారం సమీపంలో ఘటన

హసన్‌పర్తి: బస్సు, బైక్‌ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదం అంబాల, హనుమకొండ మార్గమధ్యలోని నాగారం సమీపంలో జరిగింది. హనుమకొండ జిల్లా నడికూడ మండలం మర్రిపల్లి గూడెం–వెంకటేశ్వరపల్లికి చెందిన బూర రాజ్‌కుమార్‌(35) నగరంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలోని నాగారం సమీపంలో చేరుకోగానే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు.. బైక్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన రాజ్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జనగామ రూరల్‌: సిద్దిపేటలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జనగామ మండలంలోని పెద్దపహాడ్‌ గ్రామానికి చెందిన ఎండీ మునీర్‌ (30) మృతి చెందాడు. మునీర్‌ దంపతులు కొంత కాలంగా సిద్దిపేటలో బంగారం పని చేసుకుంటూ జీవిస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలు ఉండగా సమీపంలోని ఓ పాఠశాలలో చదువుకుంటున్నారు. ఈ క్రమంలో పిల్లలకు భోజనం తీసుకెళ్తుండగా బైక్‌ అదుపు తప్పి కిందపడింది. ఈ ఘటనలో మునీర్‌ మృతి చెందాడు.

‘మల్బరీ’లో పశు ఎరువు వాడాలి

- సైంటిస్టు వినోద్‌కుమార్‌


మాట్లాడుతున్న వినోద్‌కుమార్‌

ఎల్కతుర్తి: మల్బరీ తోటలో రసాయణ ఎరువులకు బదులు పశువు ఎరువు వినియోగించాలని సైంటిస్టు వినోద్‌కుమార్‌ యాదవ్‌ రైతులకు సూచించారు. మండల కేంద్రంలోని పట్టుపరిశ్రమ కార్యాలయంలో నిర్వహిస్తున్న 3 రోజుల శిక్షణలో భాగంగా మంగళవారం కొనసాగిన రెండో రోజు కార్యక్రమంలో వినోద్‌కుమార్‌ యాదవ్‌ ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. రెండు ఎకరాల మల్బరీ తోటలో 12 టన్నుల పశువుల ఎరువు వేయాలన్నారు. తద్వారా ఆకు పచ్చదనం నిండుకుని నాణ్యతగా లభిస్తుందన్నారు. దీంతో పట్టుపురుగుల పెంపకంలో నాణ్యమైన పట్టుగూళ్లు రావడంతో పాటు అధిక దిగుబడి పెరుగుతుందని తెలిపారు. మల్బరీ సాగు చేసే రైతులకు ప్రభుత్వం నుంచి సబ్సిడీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త గడ్డిపల్లి, సైంటిస్టు రాఘవేంద్ర, ఏడీఎస్‌ వరంగల్‌ డాక్టర్‌ దయాకర్‌రావు, ఎం సారంగపాణి, డాక్టర్‌ దినేష్‌కుమార్‌ తివారి, పట్టుపరిశ్రమ శాఖ అధికారి సీహెచ్‌ నవీన్‌పాల్‌రెడ్డి, కె.సంజీవరెడ్డి, ఏఎస్‌ఓ అరవింద్‌, రాజయ్య, ఎండీ షోయాబ్‌ఖాన్‌, టీవో దేవరరాజ్‌, టీఏ రాజు, ఉమ్మడి వరంగల్‌ జిల్లా పట్టురైతులు పాల్గొన్నారు.

యాంటీ బయోటిక్‌పై అవగాహన ఉండాలి

- డాక్టర్‌ మహేందర్‌
- మామునూరు కేవీకేలో రైతులకు శిక్షణ


మాట్లాడుతున్న డాక్టర్‌ మహేందర్‌

కరీమాబాద్‌: యాంటీ బయోటిక్‌ మందుల వినియోగంపై రైతులకు అవగాహన ఉండాలని తెలంగాణ రాష్ట్ర పశు వైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్‌ మహేందర్‌ అన్నారు. మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ‘యాంటీ మైక్రోబియల్‌ నిరోధకత, పరిష్కారాలు’ అనే అంశంపై నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు యాంటీ బయోటిక్‌ మందులు విచక్షణరహితంగా వినియోగించడం వల్ల ప్రజారోగ్య సమస్యగా మారిందన్నారు. పాడి పశువులకు అవసరం లేకున్నా ఈ మందులు వేయడం వల్ల యాంటీ బయోటిక్‌ రెసిస్టెన్స్‌ ఏర్పడడమే కాకుండా ఆ పాలు తాగిన మనుషులు కూడా కొన్నిసార్లు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. రైతులు ప్రతీ విషయంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త రాజన్న మాట్లాడుతూ తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయంతోపాటు హైదరాబాద్‌కు చెందిన సద్గురు మేనేజ్‌మెంట్‌ కన్సల్టెంట్‌ ఒప్పందం ప్రకారంగా జిల్లాలోని రైతులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించడమే కాకుండా సందేహాలుంటే వారిని అడిగి నివృత్తి చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సద్గురు మేనేజ్‌మెంట్‌ ప్రతినిధి శ్రీదివ్య, జెనెక్స్‌ రీజినల్‌ మేనేజర్‌ హరీష్‌రావు, కేవీకే శాస్త్రవేత్తలు శశాంక్‌, సాయికిరణ్‌, పలువురు రైతులు పాల్గొన్నారు.

గొడ్డలితో చెల్లిపై అన్న దాడి..

- ఆస్తి తగాదాల నేపథ్యంలో ఘాతుకం
- లక్ష్మీదేవిపేటలో ఘటన


ఘటనా స్థలిలో వివరాలు సేకరిస్తున్న ఎస్సై రాజు

వెంకటాపురం(ఎం): ఆస్తి తగాదాలతో చెల్లిపై అన్నయ్య గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని లక్ష్మీదేవిపేటలో జరిగింది. వెంకటాపురం ఎస్సై రాజు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పొన్నం రాధమ్మ, శ్రీహరి దంపతులకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు. పెద్ద కుమార్తె వివాహం అనంతరం శ్రీహరి మృతిచెందాడు. దీంతో దివ్యాంగులైన అక్కాచెల్లెల్లు సమ్మక్క, సారక్క.. తల్లి రాధమ్మతో కలిసి ఉంటున్నారు. ఇద్దరు కూతుళ్లకు తండ్రి శ్రీహరి మూడు ఎకరాల భూమి ఇవ్వగా, అందులో ఎకరం భూమిని ఇటీవల కూతుళ్లు అమ్మకానికి పెట్టి బయానా తీసుకున్నారు. దీంతో సోదరుడు సమ్మయ్య.. భూమి అమ్మొద్దని, చెల్లెళ్లతో తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం సారక్కతో భూమి విషయమై సమ్మయ్య, అతడి భార్య ఇందిర గొడవపెట్టుకున్నారు. ఆగ్రహానికి గురైన సమ్మయ్య.. సారక్కపై గొడ్డలితో దాడికి పాల్పడగా తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకుంది. విషయం తెలుసుకున్న వెంకటాపురం ఎస్సై రాజు ఘటనా స్థలికి చేరుకుని సారక్కను చికిత్స నిమిత్తం వరంగల్‌ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అనంతరం సమ్మయ్య, ఇందిరను అదుపులోకి తీసుకుని గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

కిక్‌ బాక్సింగ్‌లో పతకాల పంట


పతకాలు సాధించిన క్రీడాకారిణులతో వ్యవసాయశాఖ ఏడీ బలరాం తదితరులు

వరంగల్‌ స్పోర్ట్స్‌: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఈ నెల 20, 21వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా కిక్‌ బాక్సింగ్‌ పోటీల్లో హనుమకొండ జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. హనుమకొండ విద్యార్థిని బండారి సాన్వీమోహన్‌ 36 కేజీల పాయింట్‌ ఫైట్‌ విభాగంలో బంగారం, లైయిట్‌ కాంటాక్ట్‌ ఫైట్‌ విభాగంలో వెండి పథకాలు సాధించినట్లు హనుమకొండ కిక్‌ బాక్సింగ్‌ అసోసియేషన్‌ ప్రెసిడెంట్‌ బండారి సంతోష్‌ తెలిపారు.

అగ్రికల్చర్‌ విద్యార్థినుల సత్తా..

వరంగల్‌ అగ్రికల్చర్‌ కళాశాలకు చెందిన 9 మంది విద్యార్థినులు పాల్గొనగా సీనియర్‌ విభాగంలో కరాటే కట్టాస్‌ పాయింట్‌ ఫైట్‌, లైట్‌ఫైట్‌, కిక్‌లైట్‌, ఫైటింగ్‌ విభాగాలలో పాల్గొని ఎం భార్గవి 60 కేజీల విభాగంలో గోల్డ్‌ మెడల్‌, పీవీ శ్రీజ 65 కేజీల కేటగిరీలో గోల్డ్‌, బ్రాంజ్‌, బి శ్వేత 45కేజీల గోల్డ్‌, బ్రాంజ్‌ మెడల్‌, బి అఖిల 55కేజీల గోల్డ్‌, సిల్వర్‌ మెడల్స్‌, మాధవి 40 కేజీల విభాగంలో సిల్వర్‌, జి ప్రియాంక, కె శ్యామల, ఎస్‌ హరిప్రియ కాంస్య పతకాలు సాధించినట్లు కోచ్‌ సిరిగిరి తిరుపతి తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను వ్యవసాయ కళాశాల ఏడీ బలరాం, ఓఎస్‌డీ సంతోష్‌, వెంకట్‌ అభినందించారు.

‘ప్లాస్టిక్‌’లో దగ్గు మందు ప్రాణాంతకం

- సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌



మాట్లాడుతున్న సుదర్శన్‌

ఖిలా వరంగల్‌ : ప్లాస్టిక్‌ బాటిళ్లలోని దగ్గు మందు ప్రాణాంతకమని, దీని నిషేధం కోసం న్యూఢిల్లీలోని డైరెక్టర్‌ జనరల్‌, రాష్ట్ర డ్రగ్స్‌ కంట్రోల్‌ అడ్మినిస్ట్రేషన్‌ అధికారులకు ఫిర్యాదు చేశామని సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఏబీసీ డబ్ల్యూసీ నేషనల్‌ మెంబర్‌ మెగిలిచెర్ల సుదర్శన్‌ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వరంగల్‌ శివనగర్‌లోని సమాఖ్య కార్యాలయంలో మురహరి కార్తీక్‌ అధ్యక్షతన నాసిరకం ఔషధాలపై ఉమ్మడి జిల్లా స్థాయిలో ఆర్‌ఎంపీ, పీఎంపీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు దేశాలు బ్యాన్‌ చేసిన ప్లాస్టిక్‌, పీఈటీ బాటిళ్లలో నింపిన దగ్గు మందు (కాఫ్‌ సిరప్‌)ను పిల్లల తాగించడం వల్ల మరణాలు సంభవించాయన్నారు. పలు కంపెనీలు ప్లాస్టిక్‌ బాటిళ్లలో దగ్గు మందు నింపి సరఫరా చేస్తున్నాయని, దీనిని వెంటనే నిషేధించాలని డిమాండ్‌ చేశారు. ఆర్‌ఎంపీలు, పీఎంపీలు దగ్గు మందు వినియోగంపై జాగ్రత్తలు పాటించి పిల్లల ఆరోగ్యం కాపాడాలని కోరారు. అనంతరం ప్రభుత్వ వైద్యుడు మోహన్‌రావు మాట్లాడారు. వివిధ వ్యాధుల నిర్మూలనకు వినియోగించే మందులపై వైద్యులకు సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, దంత వైద్యులు చంద్రకాంత్‌, మీర్‌ శాభీర్‌, రవీందర్‌, పరమేశ్వర్‌, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌ బియ్యం పట్టివేత

లింగాలఘణపురం : మండలంలోని నెల్లుట్ల బ్రిడ్జి వద్ద మంగళవారం అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల పీడీఎస్‌ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌ తెలిపారు. ఏఎస్సై అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం చీకటిమామిడి గ్రామ శివారులోని గోవింద్‌ తండాకు చెందిన మేఘవత్‌ శంకర్‌ గూడ్స్‌ వాహనాన్ని తనిఖీ చేయగా రేషన్‌ బియ్యం లభించాయి. దీంతో బియ్యంతోపాటు వాహనం స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. కాగా, శంకర్‌.. వాహనంలో పాలకుర్తి మండలం గూడూరు నుంచి పటాన్‌ చెరు ప్రాంతంలోని కోళ్ల ఫామ్‌లకు అక్రమంగా రేషన్‌ బియ్యం తరలిస్తున్నారని ఎస్సై పేర్కొన్నారు.